సాక్షి ఒడిశా
సోమవారం। 6। ఫిబ్రవరి। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,32,851లు, బంగారం 3.1 గ్రాములు, వెండి 8.9 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ధర్మ పరిరక్షణే ధ్యేయం

-8లో



బబిదాస్‌తో నారాయణ నందో భేటీ

-8లో

న్యూస్‌రీల్

అడవిలో అస్థిపంజరం గుర్తింపు



అటవీ ప్రాంతంలో గుర్తించిన మానవ అస్థిపంజరం

భువనేశ్వర్: పూరీ జిల్లా గోప్ పరిసర ప్రాంతాల్లో మానవ అస్థిపంజరాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న గోపాల్ థాణా పోలీసులు.. ఘటనా స్థలాన్ని సందర్శించారు. వీరితో పాటు సైంటిఫిక్ బృందం ఘటనా స్థలంలో పరిసరాలను పరిశీలించింది. డొభొరొ పంచాయతీ ఇట్టాకుదొ గ్రామం ముగేయి నదీతీరం అటవీ ప్రాంతంలో ఇది వెలుగు చూసింది. దీనిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అస్థిపంజరం రెండు, మూడు నెలల క్రితం మరణించిన వ్యక్తిదై ఉంటుందని పరిశీలన బృందాలు అభిప్రాయం వ్యక్తం చేశాయి.

సత్తాచాటిన బరంపురం క్రీడాకారులు



సాధించిన పతకాలతో సౌమ్య, ప్రతాప్ నాయక్

బరంపురం: ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన 12వ జాతీయ తైక్వాండో జూనియర్ చాంపియన్‌షిప్‌లో బరంపురం నగరానికి చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. ఇందులో సౌమ్య, ప్రతాప్ నాయక్ పతకాలు సాధించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని బొరాలి పట్టణంలో జరిగిన ఈ పోటీల్లో కొనిసిలోని కళింగా అకాడమీకి చెందిన సౌమ్య, ప్రతాప్‌నాయక్ పాల్గొని, వివిధ విభాగాల్లో వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని శిక్షకుడు ఎస్.బాలకృష్ణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను నగర ప్రముఖులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆదివారం అభినందనలు తెలియజేశారు.

మా జగజ్జననీ ఆదాయం రూ.2,27,300లు



మందిరంలో కానుకలను లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

జయపురం: పట్టణంలోని ప్రసిద్ధ మా జగజ్జననీ అమ్మవారి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ఆదాయాన్ని అధికారులు ఆదివారం లెక్కించారు. ఇందులో రూ.2,27,300 నగదు ఉన్నట్లు మందిర కమిటీ వెల్లడించింది. కమిటీ సభ్యులు, అర్చకుల సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు వల్లభ నారాయణ షొడంగి, కమిటీ అధ్యక్షుడు కెల్ల లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు ఎ.రామారావు, కార్యదర్శి మాధవ రథ్, బాబూ పట్నాయక్, దినేష్ రథ్, అనంతసింగ్, సుధాంశు దాస్, లక్ష్మణ జానీ, రామ బెహరా, ప్రవీణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మూల విరాట్‌లకు మహాస్నానం



పూరీ జగన్నాథాలయం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో దాదాపు 3 గంటల పాటు భక్తులకు దర్శనం స్తంభింపజేశారు. దర్శనం కోసం విచ్చేసిన భక్తుడు ప్రధాన ఆలయం ప్రాంగణంలో వాంతి చేయడంతో శనివారం రాత్రి ఈ పరిస్థితి నెలకొంది. ఈ విషయం దృష్టికి రావడంతో ఆలయ ఆచారం ప్రకారం శుద్ధి ప్రక్రియ చేపట్టారు. మూల విరాట్‌లు ఆసీనులైన రత్న సింహాసనం, ఆలయ ఆవరణ శుద్ధి చేసి, దేవుళ్లకు మహా స్నానం చేయించారు. ఈ ప్రక్రియ ముగిశాక ద్వితీయ భోగ మండప సేవ చేపట్టారు. ఇదంతా పూర్తయ్యేంత వరకు భక్తులకు సర్వదర్శనం నిలిపి వేశారు. దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం స్వల్ప ఇబ్బంది ఎదుర్కోవడం అనివార్యమైందని ఆలయ వర్గాలు తెలిపాయి.


సంగమం.. సంకటం!



డ్రెజ్జింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ (ఫైల్ ఫోటో)



బంగాళాఖాతంలో బౌదా నది కలిసే సంగమ ప్రాంతం



ఇసుక దిబ్బలుగా మారిపోయిన నది ముఖద్వారం

- గోపాల్‌పూర్–బౌదా తీరంలో మూసుకుపోతున్న ముఖద్వారం
- ఇసుక మేటలతో ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు
- డ్రెజ్జింగ్ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం నవీన్ పట్నాయక్
- మూడేళ్లయినా అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోని వైనం

బరంపురం: అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందిన గోపాల్‌పూర్ తీరంలో నది ముఖద్వారం రోజురోజుకూ మూసుకుపోతోంది. బౌదా–సాగర సంగమ స్థలంలో భారీగా ఇసుక మేటలు వేయడంతో సాగరంలోకి వెళ్లేందుకు గంగపుత్రులు అవస్థలు పడుతున్నారు. దీనిపై మూడేళ్ల క్రితం గోపాల్‌పూర్ సమీపంలో మూసుకు పోతున్న బౌధా నది ముఖద్వారం వద్ద డ్రెజ్జింగ్(ఇసుక తీత) పనులకు సీఎం నవీన్ పట్నాయక్ శంకుస్థాపన చేశారు. దీనికి సంబంధించి రూ.కోటిన్నర నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే మూడేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. దీంతో చుట్టుపక్కల మత్స్యకార గ్రామాలైన సూన్‌పూర్, మార్కండి, కొత్తూరు, పట్టి సూన్‌పూర్, పాలూరు, భక్షిపల్లి, గొళబందా తదితర గ్రామాలకు చెందిన గంగపుత్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేటనే జీవనాధారంగా చేసుకొని, జీవిస్తున్న సుమారు 15 గ్రామాలకు చెందని వారంతా నానా పాట్లు పడుతున్నారు. పాలనాధికారుల నిర్లక్ష్యం తమ పొట్ట కొడుతోందని విమర్శిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

గంజాం జిల్లాలో 35 కిలోమీటర్ల సువిశాల సముద్ర తీరం ఉంది. గోపాల్‌పూర్ సమీపంలో బౌదా నది బంగాళాఖాతంలో కలిసే ప్రాంతం పర్యాటకులకు కనువిందు చేస్తుంది. అప్పట్లో అంతులేని అపారమైన మత్స్య సంపద, పచ్చదనంతో పర్యాటకుల స్వర్గధామంగా కనిపించే బౌదా–సాగర సంగమ ప్రాంతం.. క్రమేణా కనుమరుగవుతోంది. గత కొద్ది ఏళ్లుగా వచ్చిన వరదలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ సంగమ స్థలంలో భారీగా ఇసుక మేటలు వేసింది. దీంతో భిన్న జీవజాతులకు ఆలవాలమైన బౌదా బ్యాక్ వాటర్‌లో ఏర్పడిన ఉప్పునీటి సరుస్సు నామ రూపాల్లేకుండా పోయింది. ఈ ఉప్పునీటి సరస్సు తోపాటు సముద్రం పైనే ఆధారపడిన వేలాది మత్స్యకార కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం వాటిల్లింది. సముద్రం నుంచి సరస్సులోకి నీరు వచ్చే ముఖద్వారాలు సైతం ఇసుక మేటలతో మూసుకుపోయింది. దీంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పరిశ్రమమ వ్యర్థాలతో సరస్సు కూడా కలుషితంగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఎ.సింహాద్రి తదితరులు సమస్యను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం నవీన్ పట్నాయక్.. రూ.కోటి 50 లక్షల నిధులు మంజూరు చేస్తూ స్వయంగా డ్రెజ్జింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పనులు ప్రారంభించాలని స్థానిక మత్స్యకారులంతా కోరుతున్నారు.



ఉప్పునీటి సరస్సులో నిలిచిపోయిన మత్స్యకారుల పడవలు

జగన్నాథుని గజోద్ధరణ అలంకరణ



గజోద్ధరణ అలంకరణలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

భువనేశ్వర్: పవిత్ర మాఘపూర్ణిమ పురస్కరించుకుని జగన్నాథుడు గజోద్ధరణ అలంకరణతో శోభిల్లాడు. ఈ అలంకరణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. గజోద్ధరణ అలంకరణలో స్వామి చతుర్భాహువులతో గరుడ వాహనంపై చెంతన లక్ష్మీదేవితో దర్శనం ఇవ్వడం విశిష్టత. జగన్నాథుడు నాలుగు చేతుల్లో శంఖం, చక్రం, గద, పద్మం ధరించి ఉండటం విశేషం. బలభద్ర స్వామి తన నాలుగు చేతులలో శంఖం, చక్రం, నాగలి, కంకి పట్టుకుని వాసుదేవుని రూపంలో దర్శన భాగ్యం కల్పించాడు. శ్రీకృష్ణుని నిలువెత్తు భంగిమలో పద్మం చేత పట్టుకుని సుభద్రాదేవి భక్తులకు దర్శనం లభించింది. మధ్యాహ్న ధూప, దీపాదుల అనంతరం శ్రీమందిరం రత్న సింహాసనంపై స్వామివార్లకు గజోద్ధరణ అలంకరణతో తీర్చిదిద్దారు. సంధ్యాధూపం సేవలో భాగంగా దేవుళ్లకు పాలు నైవేద్యంగా సమర్పించారు. వరుణ సరస్సులో గజరాజు స్నానం చేస్తుండగా మొసలి దాడిలో చిక్కుకుని విలవిల్లాడుతూ మహా విష్ణువుని వేడుకుని, మఖరం కోరల నుంచి విముక్తి పొందాడు. ఆపద కాలంలో శరణు కోరిన వారికి భగవంతుడు సదా ఆదుకుంటాడని ఈ పౌరాణిక గాథ వివరిస్తుంది. ఈ ఘట్టానికి ప్రతీకగా శ్రీమందిరంలో ఏటా మాఘపూర్ణిమ రోజు స్వామి వారు భక్తజనుల ఉద్ధరణ కోసం గజోద్ధారుడుగా దర్శనం కల్పించడం ఆచారంగా కొనసాగుతోంది.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బృగుభక్షి పాత్రొ

బరంపురం: గంజాం జిల్లాలో పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బృగుభక్షి పాత్రొ కోరారు. నగరంలోని గుసానినువాగంలో ఉన్న జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులంతా ఐకమత్యంతో పనిచేసి, 2024 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ప్రతి బ్లాక్, పంచాయతీలో ప్రజలకు చేరువయ్యేలా ప్రత్యేక ప్రణాళికతో సమాయత్తం కావాలని వివరించారు. సమావేశంలో బీజేపీ నగర అధ్యక్షుడు కన్ను చరణ్‌పతి, కార్యదర్శి మదన్‌మోహన్ పాత్రొ, సునీల్ సాహు, కైలాస్ షడంగి జిల్లా బ్లాక్ అధ్యక్షుడు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా పోస్ట్‌మాస్టర్ ఆత్మహత్య



కలిమెల ఆరోగ్య కేంద్రంలో సుస్మితా మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి తపాలా కార్యాలయంలో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న సుస్మితా సాహు(20) ఆత్మహత్య చేసుకున్నారు. తనతో పాటు కలిమెల సమితి టిగాల్ సబ్ పోస్టాఫీసులో పనిచేస్తున్న రేఖా పాణి అనే మరో పోస్టుమాస్టర్‌తో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రోజులాగే శనివారం ఇరువురూ తమ కార్యాలయాలకు వెళ్లిపోయారు. తాను పనిచేస్తున్న కలిమెల సబ్ పోస్టాఫీస్‌కు వెళ్లిన ఆమె.. విధులు ముగించుకొని, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. అయితే ముందే ఇంటికి చేరుకున్న సుస్మిత విషం తాగి, ఆత్మహత్యకు పాల్పడింది. తిరిగి వచ్చేసరికి సుస్మితా నోటి నుంచి నురగలు రావడాన్ని గమనించిన రేఖ.. ఇరుగు పొరుగు వారి సాయంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఆమె 5నెలల క్రితమే నయాగఢ్ నుంచి మల్కన్‌గిరి జిల్లా కలిమెలకు వచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షిర్డీసాయి మందిరంలో పౌర్ణమి ఉత్సవం



పల్లకిలో బాబాను ఊరేగిస్తున్న భక్తులు

పర్లాకిమిడి: మాఘపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని రేఖాన వీధిలో ఉన్న షిర్డీసాయి మందిరంలో ఆదివారం తిరువీధి ఉత్సవాన్ని కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకిలో ఊరేగించారు. మధ్యాహ్నం మందిరం వద్ద అన్నదానం జరిపారు.

5టీ కార్యదర్శికి వినతుల వెల్లువ



కొరాపుట్ సర్క్యూట్ హౌస్‌లో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఈశ్వర్ పాణిగ్రాహి

- దేవమాలి పర్వత్రాన్ని సందర్శించిన వీకే పాండ్యన్ బృందం



దేవమాలి పర్వతాన్ని సందర్శిస్తున్న పాండ్యన్, వినీల్‌కృష్ణ, అక్తార్

కొరాపుట్: రాష్ట్ర 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్‌కు వినతులు వెల్లువెత్తాయి. కొరాపుట్‌కు శనివారం చేరుకున్న ఆయన.. జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో బసచేశారు. ఈ సందర్భంగా పాండ్యన్ వద్దకు వివిధ రంగాల ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ సమస్యలను విన్నవించారు. జిల్లాలోని ముస్లిం, క్రైస్తవ, హిందూ సంస్థల ప్రతినిధులు వేర్వేరుగా కలిసి, కొరాపుట్ మున్సిపాలిటీ చైర్మన్ లలాటేందు రంజన్‌శొతి నేతృత్వంలో కౌన్సిలర్లు వినతిపత్రాలు అందజేశారు. కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి నేతృత్వంలో ఎమ్మెల్యే రఘురాం పాడాల్, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభు జానీ, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్ గౌరవ సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ప్రముఖ పర్యటక ప్రాంతం కొరాపుట్ జిల్లాలోని పొట్టంగి సమితి దేవమాలి పర్వతానికి ప్రత్యేక హెలీకాప్టర్‌పై చేరుకున్నారు. అక్కడ ఎకో టూరిజం అభివృద్ధికి సాధ్యాసాధ్యాలపై ఆరా తీశారు. నారాయణపట్న సమితి కేంద్రంలో జగన్నాథ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. జంఝావతి ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్లి, క్షేత్ర పర్యటన చేశారు. భూ సేకరణ కోసం సమావేశం నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మితమైతే బంధుగాం, నారాయణపట్న సమితులలో వందలాది ఎకారలకు సాగు నీరు అందించవచ్చని సూచించారు. అనంతరం దండాబడిలో స్వయం సహాయక బృందాలతో సమావేశమయ్యారు. పరిశీలనలో రాష్ట్ర క్రీడాశాఖ కార్యదర్శి వినీల్‌కృష్ణ, కొరాపుట్ జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

- ట్రక్కులో తరలిస్తున్న రూ.50 లక్షల సరుకు స్వాధీనం
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలో రోజురోజుకీ గంజాయి మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. నగరానికి సమీపంలోని 16వ నంబర్ జాతీయ రహదారి మీదుగా ట్రక్కులో అక్రమంగా రవాణా జరుగుతున్న గంజాయిని బరంపురం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనంలోని 240కిలోల సరుకును సీజ్ చేసి, ట్రక్కు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. బరంపురం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దామోదర్ పండా అందించిన సమాచారం, కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఆదేశాలతో గజపతి జిల్లా మోహానా అటవీ ప్రాంతం నుంచి బరంపురం మీదుగా ఉత్తరప్రదేశ్ వైపు వెళ్తున్న వాహనంపై పోలీసులు దాడులు నిర్వహించారు. చమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధి ఫుకిడిబొందొ జంక్షన్ వద్ద ఎక్సైజ్ అధికారి గీతాంజలి సాహు, సిబ్బంది అటుగా వస్తున్న టక్కులో 240 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ రియాజ్‌గా గుర్తించారు. సీజ్ చేసిన సరుకు బహిరంగ మార్కెట్‌లో రూ.50 లక్షల విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఏడుగురు నిందితుల అరెస్ట్..

రాయగడ: జిల్లాలోని గుడారి, కెరడ ప్రాంతాల్లో జిల్లా ఎక్సైజ్ సిబ్బంది ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించిన దాడుల్లో 68 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆశాఖ ఎస్పీ అభిరాం బెహరా వెల్లడించారు. దీనికి సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఈనెల 4న ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కెరడలో దీనబంధు రౌత్ అనే వ్యక్తి గంజాయితో పట్టుబడగా, అతని వద్ద నుంచి 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గుడారిలోని కలియా బిద్దిక, రవి లిమ్మ, సుశాంత్ బిర్ నుంచి 39 కిలోలు, చందనకుమార్ ప్రధాన్, జగబంధు పిరబాక, శశి సిరబాకల నుంచి మరో 22 కిలోల గంజాయి పట్టుబడినట్లు వివరించారు.



రాయగడ: పోలీసుల అదుపులో నిందితులు

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

జలుమూరు: మండలంలోని కరవంజ పంచాయతీ పరిధి మట్టవానిపేటకు చెందిన మొగిలిపల్లి నిర్మల (33) శనివారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. భర్త వేధింపులు తాళలేక ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. పోలీసులు, మృతురాలి తండ్రి రామారావు తెలిపిన వివరాల మేరకు.. నిర్మలకు పాతపట్నం మండలం కోయి కొండ గ్రామానికి చెందిన మొగులిపల్లి నందీశ్వరరావుతో 2017లో పెళ్లయ్యింది. వీరికి ఐదు, మూడేళ్ల వయసు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే మగ సంతానం లేదని నందీశ్వరరావు వేధించేవాడు. చెడు వ్యసనాలకు కూడా బానిసై నిర్మలను పట్టించుకునేవాడు కాదు. తల్లీపిల్లలు మట్టవానిపేటలోనే ఉండేవారు. పిల్లల ను తీసుకెళ్లాలని కో రినా నందీశ్వరరావు వినలేదని, ఆ మనస్తాపంతోనే ఇంటిలో ఉన్న శ్లాబ్‌కు ఉరి వేసుకుందని తండ్రి తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

శోకసంద్రంలో మండాది



మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ఆమదాలవలస రూరల్: మండలంలోని శ్రీనివాచార్యులపేట పంచాయతీ మండాది గ్రామం సమీపంలో లారీ ఢీకొని నలుగురు ఉపాధి వేతనదారులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతిచెందిన అంబటి సత్తెమ్మ, మురు వంద ల పాపమ్మ, కురమాన లక్ష్మి, అమలాపురపు గౌరమ్మల మృతదేహాలకు ఆదివారం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధు వులకు అప్పగించారు. స్వగ్రామంలోనే వీరి అంత్యక్రియలు జరిగాయి. నలుగురి అంత్యక్రియలు జరగడంతో ఊరంతా విషాదంలో మునిగిపోయింది.

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

మృతుల కుటుంబాలను డ్వామా పీడీ జీవీ చిట్టరా జు ఆదివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తోటి వేతనదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా రావాల్సిన పరిహారాన్ని వీలైనంత త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి పనుల కోసం వెళుతున్న సమయంలో దుర్ఘటన చోటుచేసుకోవడం బాధాకరమని అన్నారు. పరామర్శలో మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు, ఏపీవో లక్ష్మీనరసమ్మ, ఈసీ రాము, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం గ్రామ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పాత నౌపడలో వీఆర్‌వోగా పనిచేస్తున్న ఇ.నాగరాజు వ్యక్తిగత పనుల నిమిత్తం అక్కవరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి జాతీయ రహదారిపై వ్యతిరేక మార్గంలో వస్తుండగా అదే సమయంలో పలాస నుంచి శ్రీకాకుళం వైపు బి.కామేశ్వర రావు తన ద్విచక్ర వాహనంపై వెళ్తూ పరస్పరం ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని పెద్దబమ్మిడి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదం ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేట నుంచి టెక్కలి వెళ్తున్న ఆటోను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న టెక్కలి మండలం కొనుసులకొత్తూరుకు చెందిన మెట్ట శాంతారావు, టెక్కలికి చెందిన కోరాడ మోహనలకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

కరాటే పోటీల్లో సోనియాకు రజతం



రజత పతకంతో సోనియా

పాతపట్నం: విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో తైక్వా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2023లో 56 కేజీల విభాగంలో పాతపట్నం శివశంకర్ కాలనీకి చెందిన నల్ల సోనియా రజత పతకం సాధించింది. ఏపీతో పాటు తెలంగాణ, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలు పాల్గొన్న ఈ పోటీల్లో సత్తాచాటడంతో జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపికైంది. కరాటేతో పాటు కుస్తీ పోటీల్లోనూ సోనియా ప్రతిభ చూపుతోంది. హిరమండలంలోని సుభలయకు చెందిన కరాటే శిక్షకుడు సింహాచలం వద్ద శిక్షణ పొందినట్లు సోనియా తెలిపారు.

ధర్మ పరిరక్షణే ధ్యేయం



వేదికపై పూరీ గోవర్ధనగిరి పీఠాధిపతి నిశ్చలానంద సరస్వతి



శంకరాచార్యుల పాదుకలకు పూజలు చేస్తున్న దృశ్యం



కొరాపుట్‌: రైల్వే స్టేషన్‌లో భక్తులకు అభివాదం చేస్తున్న పూరీ శంకరాచార్య

- పూరీ గోవర్ధనగిరి పీఠాధిపతి నిశ్చలానంద సరస్వతి
- జయపురం ధర్మ పరిరక్షణకు సభకు తరలివచ్చిన భక్తులు

జయపురం: సనాతన ధర్మ పరిరక్షణ, హిందూ రాష్ట్ర స్థాపనే ప్రధాన లక్ష్యంగా తమ లక్ష్యం అన్నారు పూరీ గోవర్ధనగిరి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి ప్రకటించారు. దీనిని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జయపురంలోని దసరా పొడియా మైదానంలో ఆదివారం నిర్వహించిన ధర్మ పరిరక్షణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. ముందుగా దైవ ప్రార్థనలు చేసిన నిశ్చలానంద.. సనాతన ధర్మం అతి ప్రాచీనమైనదని, దీనిని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ధర్మ పరిరక్షణ, స్వశక్తి సమృద్ధి, హిందూ రాష్ట్ర నిర్మాణ స్థాపన చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామాయణ, మహాభారతం లోని పలు అంశాలను ఉదాహరించారు.శంకరాచార్య శిష్య బృందంలో దివ్యానంద సరస్వతి, సత్యదానంద సరస్వతి, హృషీకేష్ మహారాజా తదితరులు మాట్లాడుతూ క్రైస్తవమతం 2వేల ఏళ్ల క్రితం అవతరించిందని, ఇస్లాం, బౌద్ధం, సిక్కు, జైన్ మతాలు ఎప్పటి నుంచి ప్రారంభమయ్యాయో స్పష్టమైన గణాంకాలు ఉన్నాయని తెలిపారు. అయితే హిందూ మతం అనాదిగా వస్తున్న సనాతన ధర్మం అని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని అంతా పాటించాలని, ఆ లక్ష్యంగా ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో శంకరాచార్య స్వాగత సమితి అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, కార్యదర్శి నరేంద్ర మతానియా, బీజేడీ నాయకులు, మాజీ మంత్రి రబినారాయణ నందో, కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినీపతి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌతమ సామంతరాయ్, జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి మాట్లాడారు. అనంతరం పాదుకలకు పూలమాలలు వేసి, పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదల్, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, ధార్మప్రచార సంస్థలు పాల్గొన్నారు.

గంటన్నర ఆలస్యంగా..

జగత్‌గురు శంకరాచార్య సభా స్థలానికి ఉదయం 11.30 గంటలకు రావాల్సి ఉండగా దాదాపు ఒంటి గంటకు చేరుకున్నారు. శనివారం రాత్రి 8.30 గంటలకు రైల్వే స్టలేషన్‌లో వందలాదిమంది స్వాగతం పలికారు. అతనిని శిష్యులు వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. సభలో ముందువరుసలో కూర్చుకున్న అనుమానస్పద మరో మతస్తుడైన ఒక యువకుని పోలీసులు సభనుండి బయటకు తీసుకుపోయారు.

కొరాపుట్‌లో ఘన స్వాగతం

కొరాపుట్‌: పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి కొరాపుట్‌లో ఘన స్వాగతం లభించింది. శనివారం రాత్రి సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రైలులో జయపురం వెళ్తూ.. కొరాపుట్ రైల్వేస్టేషన్‌లో ఆగారు. ఈ సందర్భంగా జగన్నాథ శబరి శ్రీక్షేత్రం పండితులు వేద మంత్రాలతో ఆయనకు స్వాగతం పలికారు. సంకీర్తన మండళ్లు భక్తి గీతాలతో వందనాలు చేశారు. హిందూ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాదాభివందనం చేశారు. పెద్దఎత్తున ప్రజలు రైల్వే స్టేషన్‌కు చేరుకొని దర్శనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు బందోబస్తు చర్యలు చేపట్టాయి. అనంతరం జయపురం పయనమయ్యారు.



నిశ్చలానంద సరస్వతికి ఆహ్వానం పలికేందుకు సిద్ధమైన నాయకులు



ధర్మప్రచార సభలో పాల్గొన్న భక్తులు

బబిదాస్‌తో నారాయణ నందో భేటీ

- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన ఫొటోలు

కొరాపుట్‌: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆంతరంగికుడు, బిజూ జనతాదల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, జాజ్‌పూర్ ఎమ్మెల్యే ప్రణవ్ ప్రకాష్‌దాస్(బబిదాస్)తో మాజీమంత్రి రబినారాయణ నందో భేటీ కావడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో వీరిద్దరూ చాలాసేపు చర్చలు జరిపారు. ఆ సమయంలో కొరాపుట్, నవరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులంతా దూరంగా నిల్చుని ఆసక్తిగా గమనించారు. శుక్రవారం ఉదయం జయపురంలో విక్రందేవ్ కళాశాల ప్లాటినం ఉత్సవాల వేదికపై రబినందో ఉండగా వేగంగా వెళ్లిన బబిదాస్.. కిందకు తీసుకు వచ్చారు. వచ్చేటప్పుడు పలుమార్లు నందోను బలవంతంగా లాక్కొని వస్తున్నట్లు వీడియోలు రాష్ట్ర వ్యాప్తంగా వైరల్‌గా మారింది. రబినందోకు, జయపురానికి తీరని అవమానం జరిగిందని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఈ ఘటనపై పార్టీ నాయకులు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ఎటువంటి ప్రకటనలు జారీ చేయలేదు. అయితే పార్టీ ఆదేశాల మేరకు సీఎం నవీన్‌కు రబినందో స్వాగతం పలికి, వేదిక వరకు తీసుకు రావాల్సి ఉంది. ప్రోటోకాల్ ప్రకారం వేదికపై మాజీ ఎమ్మెల్యేకు అవకాశం లేదు. కానీ సీఎం వేదికపై కూర్చున్న తర్వాత నందో అక్కడే నిల్చుని ఉన్నారు. దీంతో బబిదాస్ వెళ్లి ఆయనను కిందకు తీసుకు వచ్చారు. దీనిపై నందో చివరకు మీడియా ముందుకు రావాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది పార్టీ అంతర్గత వ్యవహారమని, అన్నదమ్ముల మధ్య విషయమని, ఇందులో వివాదం లేదని ప్రకటించారు. అయినప్పటికీ పరిస్థితి సాధారణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టాయి. దీంతో బబిదాస్‌ను రంగంలోకి దింపి, కొరాపుట్‌లో చర్చలు జరిపారు. రోజంతా ఇరువురూ కలసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



కొరాపుట్ సర్క్యూట్ హౌస్‌లో బబిదాస్‌తో రబినందో సమాలోచనలు

వృద్ధులకు సరుకులు పంపిణీ



వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీధర్ ఆచార్య

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని దండుమాలవీధి నవ జీవన్ ఆశ్రమంలో వృద్ధులు, మహిళలకు నెలకు సరిపడా రేషన్ సరుకులను ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ ఆచార్య(తిరుపతి) ఆదివారం పంపిణీ చేశారు. మొత్తం 72మందికి వీటిని అందించామని ఆయన తెలిపారు. ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు భోజనం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పర్లాకిమిడి ఇన్‌చార్జి ఎస్వీ రమణ, బరంపురం, కళహండి, భవానీపట్న, పండుకోల్, గోలముండు, సాలూరు, పాడేరు, శ్రీకూర్మం ప్రాంతాల ఇన్‌చార్జి మేనేజర్లతో ఆయన సమావేశమయ్యారు.

సిక్కోలు జీవనాడి

- జీడి పూతపై రైతుల ఆశాభావం
- జిల్లాలో సుమారు 24 వేల హెక్టార్లలో జీడి సాగు
- ఆర్‌బీకేల ద్వారా తోటబడి కార్యక్రమాలు



ఆశాజనకంగా జీడి పూత

వజ్రపుకొత్తూరు రూరల్: జీడి రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది జీడి పూత ఆశాజనకంగా ఉండడంతో దీనిపై రైతులంతా ఆశలు పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో సుమారు 24,080 హెక్టార్లలో జీడి సాగవుతోంది. ఇందులో అత్యధికంగా ఉద్దానం ప్రాంతంలో 15 వేల హెక్టార్లలో పంట సాగవుతుండగా సీతంపేట, భామిని, కొత్తూరు, లావేరు, రణస్థలం, మెళియాపుట్టి తదితర మండలాల్లో పండిస్తున్నారు. ఈ పంటను దాదాపుగా 2.50 లక్షల మంది రైతులు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతుండగా.. మరో 3.50 లక్షల మంది కార్మికులు, వ్యాపారులు జీడి ఆధారిత పరిశ్రమలపై ఆధార పడి బతుకుతున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ప్రస్తుతం పంట చిగురు, పూత దశలో ఉంది. పరిస్థితులు అనుకూలిస్తే మంచి లాభాలు వస్తాయని రైతులంటున్నారు.

ఉద్యాన పంటలకు కేరాఫ్ ఉద్దానం

ఉద్యాన పంటలకు చిరునామాగా ఉద్దానం మారుతోంది. వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాలను కలిపి ఉద్దానంగా పరిగణిస్తారు. ఈ ప్రాంతంలో నిత్యం కొబ్బరి, జీడి, మామిడి తదితర చెట్లు కళకళలాడుతుంటాయి. జిల్లాలోనే అత్యధికంగా ఇక్కడ జీడి పంట సాగవుతోంది. లక్షలాది మంది రైతులు, జీడి కార్మికులు, వ్యాపారులు ఈ పంటను నమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్నారు. ప్రధానంగా తెల్ల బంగారంగా చెప్పుకునే పలాస జీడి పప్పుకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన గుర్తింపు ఉండటంతో రైతులు జీడి పంట సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

రెండో దశ పూతతో అధిక దిగుబడి

ఏడాదిలో జీడి పంట మూడు దశల్లో పూత వస్తుంది. నవంబర్–డిసెంబర్ నెలలో మొదటి సారిగా పూత వస్తుంది. జనవరి–ఫిబ్రవరి నెలలో రెండో దశలో పూత, అలాగే మార్చిలో మరో దశ పూత వస్తుందని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. అయితే వీటిలో జనవరి–ఫిబ్రవరి నెలల్లో వచ్చే పూత మాత్రమే అనుకూలిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు.

ఈ సమయంలో పొగమంచు, తేనె మంచు ప్రభావంతో పాటు టీ దోమ పంటకు ఆశించే ప్రమాదం ఉందన్నారు. వీటి నివారణకు పంట సాగులో యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు.

ఏడేళ్లలో జీడి పంట దిగుబడి వివరాలు:

ఏడాది	పంట విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)
2017	24,089	8,430
2018	24,087	11,455
2019	14,500	3700
2020	20,300	11,300
2021	23,089	11,050
2022	24,080	3900
2023	24,080	....





తోటబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తోటబడితో సాయం

5 ఏళ్ల క్రితం తిత్లీ తుఫాన్ సృష్టించిన బీభత్సానికి ఉద్దానం పంటలు సర్వనాశనమయ్యాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో గణనీయంగా పంట విస్తీర్ణం పెరిగింది. దీంతో ప్రస్తుతం ఉద్దానంలో మళ్లీ పచ్చని చెట్లతో కళకళలాడుతూ పూర్వవైభవం సంతరించుకుంది. ప్రస్తుతం పంట చిగురిస్తూ పూత దశలో ఉండటంతో గ్రామ స్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా అధికారులు తోటబడి కార్యక్రమాలు చేపట్టి రైతులకు సకాలంలో సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

వాతావరణం సహకరిస్తేనే..



పంట సాగు చేసేందుకు ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుపెట్టాం. ప్రస్తుతానికి జీడి పూత, పిందె దశలో ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంట బాగానే ఉంది. వాతావరణ పరిస్థితులు చివరి వరకు సహకరిస్తే ఆశించిన స్థాయిలో పంట చేతికి అందుతుంది.

– వై.రాజారావు, జీడిరైతు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

అధిక దిగుబడులు సాధించేలా..



జీడి పంటలో అధిక దిగుబడులు సాధించే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఆర్‌బీకేల పరిధిలో తోటబడి కార్యక్రమాలు చేపడుతూ రైతులకు సకాలంలో సరైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఉద్యాన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్‌వీవీ ప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, శ్రీకాకుళం

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బరంపురం: నగరంలోని ప్రేమ్‌నగర్ 2వ లైన్‌లో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ 8వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, వ్రతాలు, దీపారధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో భక్తబృందం ప్రతినిధులు పత్తి బుచ్చిబాబు, కార్యదర్శి వి.రవికుమార్ గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.



సమూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

రక్తదాతలే ప్రాణదాతలు



దాతలకు ప్రశంసా పత్రాలతో అభినందిస్తున్న పోలీసు అధికారులు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మిశ్రా

జయపురం: రక్తదాన మహత్తరమైనదని, రక్త దాతలే జీవన ప్రదాతలని యాక్సిస్ బ్యాంక్ క్లస్టర్ మేనేజర్ ఉపగుప్త మిశ్రా అన్నారు. జయపురం సబ్ డివిజన్ కుంద్రాలో అమొ ఒడియ, కుంద్రా యాక్సిస్ బ్యాంక్ ఆదివారం సంయుక్తంగా నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం వల్ల దాతలకు ఎటువంటి అపాయం ఉండదని, కానీ ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడే మహత్తర అవకాశం దక్కుతుందని తెలిపారు. శిబిరంలో 37 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం రక్త దాతలకు ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో కుంద్రా పంచాయతీ సర్పంచ్ లాబ పొరజ, పోలీసు అధికారి సమపిత స్వాయి, సబ్ ఇన్‌స్పెక్టర్ గోవింద హంసద, బ్లడ్‌బ్యాంక్ అధికారి మధుసూదన బలియార సింగ్, సిబ్బంది బిశ్వాయిని నాయక్, లక్ష్మీకాంత జైన్, అజిత్ గొఢ, రవీంద్ర మిశ్రా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా నవకుండల గాయత్రి యజ్ఞం



గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

పార్వతీపురం: పట్టణంలోని రాయగడ రోడ్డులో గల తూర్పువీధిలోని కంచుమోజు రామ్మోహన రావు గృహంలో నవకుండల గాయత్రి యజ్ఞాన్ని బ్రహ్మశ్రీ సంబాన హేమసుందర ఆచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాఘ పూర్ణిమ సందర్భంగా నిర్వహించిన ఈ యజ్ఞంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, స్వామిసేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు. లోక కల్యాణార్థం ఈ యజ్ఞం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రసాదం అమ్మకానికి వేలం రేపు

వంగర: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని సంగాంలో ఉన్న సంగమేశ్వరాలయంలో జరిగే జాతరలో ప్రసాదం అమ్మకానికి వేలం వేయనున్నట్లు ఈఓ పి.శ్యామలరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఆలయ ఆవరణలో జరిగే వేలంపాటలో ఆసక్తి ఉన్న వారు రూ.20 వేలు డిపాజిట్ చేసి, పాల్గొనాలని కోరారు.

పులి దాడిలో ఆవు మృతి



పులి దాడి చేయడంతో మృతి చెందిన పశువు

గంట్యాడ: మండలంలోని తాటిపూడి అవల ఉన్న డీకేపర్తి పంచాయతీ పరిధి రాపాలెం గ్రామానికి చెందిన పి.నాగరాజు ఆవుపై పులి దాడి చేసి చంపేసింది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. విశాఖ జిల్లా అనంతగిరి మండలం సరిహద్దు ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. దీంతో అక్కడి ప్రజలూ భయం గుప్పిట్లోకి జారుకున్నారు. గిరిశిఖర ప్రాంతం కావడంతో పులి ఏ సమయంలో దాడి చేస్తుందోనని బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.

ఒంటరినైపోయాను..!

- ఒకరి వెంట ఒకరుగా తల్లిదండ్రుల మృతి
- అనాథగా మిగిలిన వారసుడు



తల్లిదండ్రులతో కామేష్ (ఫైల్)



కామేష్

చీపురుపల్లి: పెళ్లి నాడు భర్త వెంట ఏడడుగులు వేయడం మాత్రమే కాదు మృత్యువులో కూడా భర్త వెంటే తాను కూడా అంటూ ఆమె లోకాన్ని విడిచి వెళ్లిపోయింది. కేవలం 16 రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు లోకాన్ని విడిచి వెళ్లివడంతో వారి ఒకే కొడుకు అనాథగా మిగిలాడు. పేద కుటుంబం కావడంతో పాటు తల్లిదండ్రులు మరణించడంతో ఎవరూ ఆదుకునే వారు లేక ఏం చేయాలో తెలియక, ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. పట్టణంలోని విజయాకాలనీకి చెందిన నీలాతి కృష్ణ, అప్పయ్యమ్మ దంపతులు 16 రోజుల వ్యవధిలో మరణించిన సంఘటన స్థానికంగా కలిచివేసింది. పళ్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న నీలాతి కృష్ణ కొన్నేళ్ల క్రితం పక్షవాతం బారిన పడి జనవరి 20న మృతిచెందాడు. ఇంటి యజమాని మృతి చెందాడనే బాధను దిగమింగుకోలేని భార్య అప్పయ్యమ్మ ఫిబ్రవరి 5న గుండెపోటుతో మరణించింది. మృతి చెందిన ఆ దంపతులకు కొడుకు కామేష్..ప్రస్తుతం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఆ కుటుంబానికి సొంతిల్లు కూడా లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నారు. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులు మరణించడంతో ఎలా జీవించాలో తెలియక కామేష్ తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. అంతేకాకుండా తన జీవితం ముందుకు సాగేందుకు దాతల సహకారం కోరుతున్నాడు.

ఎల్ఐసీలో పెట్టుబడులు భద్రం

విజయనగరం టౌన్: పాలసీదారుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎల్ఐసీ పని చేస్తుందని, ఎల్ఐసీలో పెట్టుబడులు భద్రమని ఎల్ఐసీ జిల్లా శాఖ నాయకుడు ఎం.వాసా ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అదానీ గ్రూపు సంస్థలపై తీవ్ర విమర్శలతో ఒక నివేదిక ప్రచురితమైన తరువాత పాలసీదారుల్లో ఆందోళన నెల కొందని పేర్కొన్నారు. అయితే పాలసీదారుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఎల్ఐసీ పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. తమ సంస్థ పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పాటైందన్నారు. అదానీ సంస్థల్లో ఉన్న తన షేర్లను వేటినీ ఎల్ఐసీ విక్రయించలేదన్నారు. అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ప్రజాగ్రహాన్ని వ్యక్తీకరించేందుకు భారత జాతీయ కాంగ్రెస్ ఫిబ్రవరి 6న సోమవారం దేశ వ్యాప్తంగా అన్ని ఎల్ఐసీ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసిందని, అటువంటి ఆలోచనలను విరమించుకోవాలని ఆయన కోరారు.

పక్కా వ్యూహంతో.. బాల్య వివాహాలకు చెక్

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే అక్షరాస్యత ఎంత ముఖ్యమో.. బాల్య వివాహాలకు చెక్ పెట్టడం కూడా అంతే ముఖ్యం. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తోంది. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయి. అదే సమయంలో ఆడపిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది.



- బాల్య వివాహాల అడ్డుకట్టకు విస్తృత ప్రచారం
- గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు
- బాలికా విద్యపై ప్రత్యేక శ్రద్ధ
- పదేళ్ల కాలంలో 852 బాల్య వివాహాలు నిలుపుదల

విజయనగరం ఫోర్ట్:

బాల్య వివాహాలకు చెక్ పెట్టడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకుగాను బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో పని చేస్తోంది. ఇప్పటికే ఆ దిశగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వం భవిష్యత్‌లో పూర్తిగా వాటికి చెక్ పెట్టేందుకు పటిష్ట చర్యలు చేపడుతుంది. బాల్య వివాహాలపై అవగాహన కల్పించడం అడ్డుకట్ట వేయవచ్చునన్న భావనతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ కార్యక్రమాలు అమలు చేస్తోంది.

2012 నుంచి నిలుపుదల చేసిన బాల్య వివాహాల వివరాలు	
సంవత్సరం	నిలిచిన వివాహాలు
2012	33
2013	68
2014	52
2015	71
2016	69
2017	75
2018	85
2019	86
2020	90
2021	113
2022	103

విస్తృత ప్రచారం

బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై విద్య, వైద్య, పోలీసు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో, గ్రామాల్లో విద్యార్థినులు దగ్గర నుంచి తల్లిదండ్రుల వరకు చైతన్యం తీసుకువచ్చేలా ప్రయత్నిస్తున్నారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయిల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు, చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ చైతన్యపరుస్తున్నారు.

సంక్షేమ పథకాలతో బాల్య వివాహాలు తగ్గాయి

బాల్య వివాహాలు ఎక్కువగా పేద కుటుంబాల్లో జరుగుతుంటాయి. ఆర్థిక ఇబ్బందులతో అమ్మాయిలను చదవు మాన్పించి వివాహాలు చేస్తుంటారు. దీన్ని గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దీంతో పాటు బాలికా విద్యను ప్రోత్సహిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇంటర్ వరకు అమ్మ ఒడి, ఆపై చదువులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న వసతిదీవెన పథకాలు అమలు చేస్తుండటంతో అమ్మాయిల చదువుకు తల్లిదండ్రులకు ఇబ్బందులు తొలిగాయి. తమ పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతూ బడులకు పంపిస్తున్నారు. దీంతో బాల్య వివాహాల సంఖ్య క్రమేపి తగ్గుతోంది.

కమిటీల ఏర్పాటు

జిల్లాలో బాల్య వివాహాలను అడ్డుకునేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ స్థాయి కమిటీలో పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో బాల్య వివాహాల నిరోధక అధికారులుగా పనిచేస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్ పనిచేస్తారు. డివిజన్ స్థాయిలో ఆర్‌డీఓ, సీఎంపీఓ పనిచేస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు నోడల్ అధికారులుగా పని చేస్తారు. బాల్య వివాహాలపై సమాచారం అందిన వెంటనే కమిటీ సభ్యులు అక్కడకు వెళ్లి అడ్డుకోవడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. బాల్య వివాహానికి కారణాలు తెలుసుకుని సమస్యలు ఉంటే పరిష్కరిస్తారు.

రెండేళ్ల జైలు

బాల్య వివాహాల నిషేధిత చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించినా.. వారిపై కేసులు నమోదు చేస్తారు. రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమాన విధించే అవకాశం ఉంది. ఒక్కోసారి జైలు, జరిమాన విడివిడిగా పడే అవకాశం ఉంది.

పదేళ్లలో 852 బాల్య వివాహాల నిలుపుదల

బాల్య వివాహాల నిలుపుదల కోసం కేటాయించిన ట్రోల్ ఫ్రీ నంబరు 1098, పోలీసులకు సమాచారం రావడంతో పలు వివాహాలను నిలుపుదల చేశారు. జిల్లాలో 2012 నుంచి ఇప్పటి వరకు 852 బాల్య వివాహాలను అధికారులు నిలుపుదల చేశారు.

ప్రత్యేక దృష్టి

బాల్య వివాహల నిరోధంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు గురించి కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చైతన్య పరుస్తున్నాం. సఖి గ్రూపుల ద్వారా కిశోర బాలికలకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరిస్తున్నాం.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి

ప్రజలకు హెల్త్ ఐడీలు

ప్రజల ఆరోగ్య వివరాలన్నీ ఒకే చోట చేర్చి ఒక కార్డులో పొందుపర్చి భవిష్యత్‌లో ఎటువంటి వైద్య సేవలైనా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించే పని దాదాపు 70 శాతం పూర్తయింది. ఈ డేటా నమోదు కూడా పూర్తయి ఐడీలు క్రియేట్ చేశారు. మిగిలిన వాటి పూర్తికి కూడా వేగవంతంగా సర్వే చేస్తున్నారు.



హెల్త్ ఐడీ క్రియేట్ చేయడం కోసం సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

- జిల్లా జనాభా 17,51,433 మంది
- ఇంతవరకు 12,70,624 మందికి హెల్త్ ఐడీలు క్రియేట్
- సదరు వ్యక్తి పూర్తి ఆరోగ్య వివరాలతో హెల్త్ ఐడీ
- మిగతా వారికి హెల్త్ ఐడీ క్రియేట్ చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలోని ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఇప్పటికే ఇంటింటా సర్వే ప్రారంభించింది. 70 శాతానికి పైగా సర్వే కూడా పూర్తయింది. మిగిలి ఉన్న ప్రజలు ఆరోగ్య చరిత్ర తెలుసుకునేందుకు సర్వే జరుగుతుంది. ప్రతి ఒక్కరికి ప్రత్యేక హెల్త్ ఐడీని క్రియేట్ చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. త్వరలోనే హెల్త్ ఐడీ క్రియేట్ చేసిన ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డును అందజేయనున్నారు.

జిల్లా జనాభా 17,51,433

జిల్లాలో 17,51,433 మంది జనాభా ఉన్నారు. వీరిలో వైద్య సిబ్బంది హెల్త్ ఐడీ క్రియేట్ చేసిన వారు 12,70,624 మంది. 70 శాతానికి పైగా జనాభాకు హెల్త్ ఐడీ క్రియేట్ చేసేశారు. ఇంకా 4,80,809 మందికి హెల్త్ ఐడీ క్రియేట్ చేయాల్సి ఉంది.

పూర్తి ఆరోగ్య వివరాలతో హెల్త్ ఐడీ

ప్రతి వ్యక్తికి బీపీ, షుగర్, ఆస్తామా, పిట్స్, కేన్సర్, గుండె తదితర వ్యాధులు ఉన్నాయా అని ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో కూడిన వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి 12.70 లక్షల మందికి హెల్త్ ఐడీ క్రియేట్ చేశారు. హెల్త్ ఐడీ ఉండడం వల్ల సదరు వ్యక్తి దేశంలో ఎక్కడైనా వైద్యం చేయించుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఐడీ నెంబర్ కొట్టగానే గతంలో అతనికి ఉన్న ఆరోగ్య చరిత్ర తెలుస్తుంది. అతనికి బీపీ, షుగర్ లాంటి వ్యాధులు ఉన్నాయా, లేదంటే అంతకు ముందు శస్త్ర చికిత్సలు ఏమైనా జరిగాయా తెలుస్తుంది. అదే విధంగా దేనికైనా అతను గతంలో వాడుతున్న మందులు గురించి కూడా తెలుస్తోంది. దీని వల్ల చికిత్స అందించడం సులభంగా ఉంటుంది.

పూర్తి కావొచ్చింది..

ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ క్రియేట్ చేయడం దాదాపు పూర్తి కావొచ్చింది. 12 లక్షలకు పైగా ప్రజలకు హెల్త్ ఐడీ క్రియేట్ చేశాం. హెల్త్ ఐడీ వల్ల భవిష్యత్‌లో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వైద్య సిబ్బంది చురుకుగా హెల్త్ ఐడీలు క్రియేట్ చేస్తున్నారు.

– డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి, డీఎంహెచ్‌ఓ

8 నుంచి ఉరుసు మహోత్సవాలు

విజయనగరం టౌన్: పట్టణంలోని ఆబాద్‌వీధి, మస్తాన్ వీధుల్లో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పట్టణ శాఖ ముస్లిం ప్రతినిధి మహమ్మద్ గౌస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న మస్తాన్ వీధిలో, 9న మహారాజా కోట వద్ద, 10న కాటవీధి పాఠశాల వద్ద ఉన్న హజరత్ సయ్యద్ సైలానీ బాదుషా ఔలియా బాబా ఆలయం వద్ద ఉత్సవాలు ఉంటాయన్నారు. అనంతరం అన్ని దర్గాల వద్ద భారీఎత్తున అన్నసమారాధన చేస్తామన్నారు. భక్తులందరూ హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కనికరించు మేరి మాతా..!



పారిస్ నుంచి తీసుకువచ్చిన వ్యాకులమాత ప్రతిమ

- ఘనంగా వ్యాకులమాత యాత్ర
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తూ విశాఖపట్నం నుంచి వస్తున్న భక్తులు

కొత్తవలస రూరల్: మండలంలోని కొండడాబా వద్ద ఉన్న వ్యాకులమాత జాతర మహోత్సవం ఆదివారం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ఆలయానికి 132 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉంది. ఫిబ్రవరి నెల మొదటి ఆదివారం నిర్వహించే ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, ఒడిశా, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. 1914 వ సంవత్సరంలో పారిస్ నుంచి తీసుకువచ్చిన వ్యాకులమాత ప్రతిమను కుల మతాలకు అతీతంగా ఆరాధించడం ఇక్కడి ప్రత్యేకత.

9రోజులుగా ప్రార్థనలు

ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రకృతి సోయగాల నడుమ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కొండడాబా కనికరమాత కొండపై జాతర సందర్భంగా గత 9 రోజుల నుంచి ఫాదర్ గొంగాడ రాజు ఆధ్వర్యంలో నవదిన ప్రార్థనలు నిర్వహించారు. ఈ జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యల్లో వచ్చే భక్తుల కోసం దిశానిర్దేశం చేసేందుకు, ట్రాఫిక్ సమస్యలు కలగకుండా ఉండేందుకు 275 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సీఐ బాలసూర్యారావు తెలిపారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం సింహాచలం డిపో, గాజువాక డిపోల నుంచి ప్రత్యేక బస్సులు, యాత్రికులకు వసతి ఏర్పాట్లు చేసినట్లు ఫాదర్ గొంగాడ రాజు తెలిపారు.




ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్‌లు



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

పార్కు దగ్ధం



కాలిపోతున్న పార్కులోని చెట్లు



నీలగిరితోటల్లో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో పబ్లిక్ పార్కు పూర్తిగా దగ్ధమైంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని పాత పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాన్ని గ్రామ యువత పబ్లిక్ పార్కుగా తీర్చిదిద్దారు. దీనికి ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు కావడంతో పార్కును మరింత సుందరంగా తయారు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి రకరకాల మొక్కలు తెచ్చి పార్కులో నాటారు. చూడడానికి ఎంతో అందంగా, అహ్లాదంగా పార్కు ఉండేది. అయితే కొన్ని నెలలుగా పార్కు మెయింటనెన్స్‌ను పట్టించుకోకపోవడంతో పార్కులో నాటిన మొక్కలన్నీ పూర్తిగా ఎండిపోయాయి. ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో వేలాది రూపాయలు విలువ చేసే మొక్కలు పూర్తిగా కాలిపోయాయి. పార్కులో అగ్ని ప్రమాదం జరిగి మంటలు వ్యాపించడంతో గ్రామ యువత స్పందించి మంటలను నీటితో తడిపి అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పార్కును అభివృద్ధి చేసేందుకు మండల అధికారులు, పంచాయతీ అధికారులు, గ్రామస్తులు తగు చర్యలు చేపట్టాలని యువత కోరుతున్నారు.

నీలగిరి తోటలు..

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు పంచాయతీ శివారు కొత్తచందులూరు గ్రామ సమీపంలో పలువురు రైతులకు చెందిన నీలగిరి తోటలు ఆదివారం దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.లక్షా ఏభైవేల విలువైన సుమారు 20 ఎకరాల్లోని నీలగిరి చెట్లు కాలిపోయాయి. అటుగా వెళ్తున్న వ్యక్తులు కాల్చిపడేసిన సిగరెట్ పీకల వల్ల మంటలు చెలరేగి నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్.కోట అగ్నిమాపక అధికారులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

గోకవలస కృష్ణమూర్తికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న గోకవలస కృష్ణమూర్తి

రాజాం: రాజాం పట్టణానికి చెందిన రంగస్థల నటుడు, సామాజిక సేవకుడు గోకవలస కృష్ణమూర్తి డాక్టరేట్ అందుకున్నారు. సేవాభారతితో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా గత 30 సంవత్సరాలుగా ఆయన వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నటుడిగా ఆయన చేస్తున్న సేవలతో పాటు సామాజిక సేవలను గుర్తించిన ఆసియా వేదిక్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్‌జీఓ గౌరవ డాక్టరేట్‌ను ఈనెల 4న హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో తెలంగాణ సర్వస్థితి పరిషత్ హాలులో ఆయనకు అందజేశాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆకుల రమేష్‌తో పాటు ప్రొఫెసర్‌లు అంజనప్ప, రంజిత్‌కుమార్, మునిమార్లప్ప తదితరులతో పాటు ప్రజాప్రతినిధులు గోకవలసను సత్కరించారు. ఈ సందర్భంగా గోకవలసను రాజాం పట్టణానికి చెందిన పలువురు సాహితీవేత్తలు, సామాజిక సేవా కార్యకర్తలు ఆదివారం అభినందించారు.

మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో హవా



రాష్ట్ర స్థాయిలో 2వ స్థానంలో నిలిచిన జిల్లా క్రీడాకారులు

శృంగవరపుకోట: కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈ నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ జరిగి న రాష్ట్ర స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు తమ సత్తా చాటారని పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన కోచ్ పి. శ్రీరాములు చెప్పారు. 35+ విభాగంలో మొహ్మద్ ఖలీలుల్లా, 40+ విభాగంలో ఎం. శ్రీను, 50+ విభాగంలో కె.అపర్ణబాబాలు ద్వితీయ స్థానాలు సాధించారని చెప్పారు. వీరంతా మార్చి నెలలో గోవాలో జరగనున్న జాతీ య స్థాయి పోటీలకు అర్హత సాధించారని, ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. వీరంతా రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముక్కాల ద్వారకానాథ్, డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డిల నుంచి బహుమతులు అందుకున్నారు.

కుమిలిపోతున్న ఊరు

- రెండు బైక్‌ల ఢీ: గ్రామానికి చెందిన ఇద్దరి మృతి
- ఒకరికి గాయాలు

ఉన్నత చదువులు చదివి కుటుంబానికి అండ వస్తాడని భావిస్తున్న సమయంలో విధి కన్ను కుట్టడంతో ఇంటర్మీడియట్ విద్యార్థి, చిన్నపాటి ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్న ఓ యువకుడిని మృత్యువు కబళించింది. ఒకే గ్రామానికి చెందిన ఆ ఇద్దరూ ఎదురెదురుగా బైక్‌లపై వస్తూ ఒకరినొకరు ఢీకొట్టి మృత్యువు పాలయ్యారు. వారిద్దరూ తమ కళ్ల ముందే తిరిగేవారవడం, ఇద్దరిదీ ఒకే గ్రామం కావడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుల కుటుంబసభ్యుల రోదన అలవి కానిదిగా ఉంది. పూసపాటి రేగ మండలం కుమిలి గ్రామంలోని ఆర్అండ్‌బీ రహదారిలో ఆదివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి.



మృతుడు వెంకటేష్



మృతుడు పైడినాయుడు (ఫైల్)

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామానికి చెందిన కురిని వెంకటేష్ (16), అదే గ్రామానికి చెందిన గేదెల పైడినాయుడు(25)లు కుమిలి సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై రెండు మోటార్‌సైకిళ్లపై ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో సంఘటనా స్థలంలోనే వెంకటేష్ మృతి చెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా పైడినాయుడు మృతి చెందాడు. పైడినాయుడుతో పాటు బైక్‌పై ఉన్న మద్దిల వినోద్ కుమార్‌కు గాయాలయ్యాయి. వెంకటేష్ పూసపాటిరేగ సూర్యోదయ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడికి తల్లిదండ్రులు రాజినాయుడు, అసిరమ్మ ఉన్నారు. పైడినాయుడు జియోటవర్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి తల్లిదండ్రులు రాజినాయుడు, రాములమ్మ ఉన్నారు. వెంకటేష్ మృతదేహానికి సుందరపేట ఆస్పత్రిలో, పైడినాయుడు మృతదేహానికి విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. క్షతగాత్రుడిని విజయనగరం తరలించగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ హెడ్‌కానిస్టేబుల్ హరిఅప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.